# "హవాల్దార్ కథ"

శ్రీమతి తు. సీతాదేవి

(గత సంచిక తరువాయి)

అంబవ్వ వంట యింట్లోకి వెళ్ళి మంచి నీరు ఒక పెద్ద యిత్తడి బిందెలోవి కప్పుతో తీసింది. ఆమె చేతులు భయముచే వణకుచుండెను. ఆమె ఆతొందరలో అనుమానముతో బహుశ బిందెమీద మూత సరిగా వేయలేదు కాబోలును, దండప్ప కప్పుతో నీరు త్రాగునప్పుడు, ఆ యిత్తడి బిందెమీద మూత క్రిందపడి శబ్దము అయినది. వంటింటిలో నిద్ర పోతున్న ఆ చిన్నవాడు భయముతో వులికిపడి లేచెను. మనిషిలేచిన ధ్వని దండప్ప చెవినిబడెను. అనుమానముతో భార్యను అడిగెను. "ఏమిటది?" ఏమి ఒక మాటకూడా బదులు చెప్పకుండానే అంబవ్వ మరల దారికడ్డముగా వెళ్ళి నుంచుంది. దండప్పకు అప్పుడు ఎవరో లోపల దాగివున్నట్లు అనుమానము గట్టిగా తట్టినది. మంచముదిగి ఆమె పైకి ఒక పరుగునవెళ్ళి అడిగెను. "నీకు ఎవరు అంత ఆప్తులున్నా ప్రాణ స్నేహితులు అక్కడ?" అంబవ్వ అప్పుడు తనకులేని ధైర్య సాహసములు తెచ్చుకుని తన శక్తినంతను వుపయోగించి చెప్పిందో చాలా కష్టము. ఆమె "ప్రాణస్నేహితుడు కాడు, కొడుకు." అంది. ఎవరికి తెలియదు ఆమెకు ఆ సమయమున ఆ సాహసము ఎట్లు వచ్చినదో, అయితే దండప్పకి ఎదురుగా ముఖముపెట్టి దారి కడ్డముగా నిలబడెను. దండప్ప కోపముచే మండిపడుచుండెను. "కొడుకు! నీ కొడుకు ఎప్పుడో చనిపోయినాడు. వీ డెవడు? దారి విడువుము" అని గట్టిగా అరిచెను. అయినప్పటికి ఆమె అను మాత్రము అక్కడనుంచి కదలలేదు. దండప్ప ఆమె చేతులు పట్టుకుని గట్టిగా తగవులాడుతున్నాడు లోపలికి వెళ్లుటకు.

యీ పాటికి యీ చిన్నవాడు లేచినాడు. తను చాలా అపాయములో వున్నాను అని గ్రహించినాడు తప్పించుకుని పోవుటకు కిటికీ ఎక్కి యినుప కడ్డీలు బలవంతముగా విరిచి పోవుటకు ప్రయత్నము చేయుచుండెను. అది దండప్ప చూచిన వెంటనే వీడే తన మనిషి అని తెలుసుకున్నాడు. వాడు పైకి గట్టిగా వళ్లు తెలియక కేకలు వేసినాడు.

"హంతకుడు కాడు, వాడు ఎప్పుడూ చేయియెత్తి ఎవరిని చంపలేదు," అంది అంబవ్వ.

"నీ కొడుకును చంపినవాడే" అన్నాడు దండప్ప. ఆమె యిది వినగానే ఆమె చేతులు వణకనారంభించెను. అయితే వెంటనే ధైర్యము తెచ్చుకుని త్రిప్పుకుంది. "వాడు చంపినది నా కొడుకు అని కాదు, ఆ తొందరలో ఆ సమయమందు అట్టిస్థితిలో అనవసరమైన పనులు అనేకమైనవి జరిగినవి" అంది అంబవ్వ. "ఔను! చూడగా నీకు యింతలో అంత వైరాగ్యము అంత ధైర్యము సంపాదించావు ప్రక్కకునుంచో. ఈ మనిషిని తప్పకు వురిసంభమునకు తీసుకుపోవాలి, ఎందుకు కాదు వీడే నా కొడుకుని చంపుటకు కారణం."

"యీ చిన్నవాని తలకొట్టినంత మాత్రమున అది మన కుమారుని వెనుకకు తీసుకు వస్తుందా?"

"నాపని, నాపించెను, ఆ బహుమానము?"

"యీ చిన్నవాని ప్రాణములు చంపితెచ్చే బహుమానము ఎంత గొప్పదైనాసరే, అది ఏదీ మనము తీసికోవద్దు."

"చూడు! వాడు మరల తప్పించుకుని పోవుటకు ప్రయత్నము చేయుచున్నాడు. నన్ను లోపలికి వెళ్లనిమ్ము. యిదిగో నీకే నేను చెప్పుతున్నాను వినుము."

యీలోపునవాడు కిటికీ చట్రము తీయగలిగెను. మరియు దానిగుండా వెలుపలికివెళ్లుటకు ప్రయ

త్నము చేయుచుండెను. అదిచూచి దండప్ప గట్టిగా భార్యతో "వాడే గనుక తప్పించుకొని పారిపోయిన యెడల నీతల వెయ్యి తునకలు అయ్యేలాగున బ్రద్దలకొట్టుతాను." అని చెప్పి తనకున్న బలమంతా వుపయోగించి శక్తికొద్ది బలమైన దెబ్బ ఒక్కటి ఆమెతలమీద కొట్టెను. ఆమె ఎంతో ఆదెబ్బకు వోర్చి కదలక మెదలక అట్లనే నిలుచుండెను. సాధారణముగా ఆనొప్పికి కేకకూడా పెట్టలేదు. ఆమె తలమాత్రము దెబ్బ బలిమిచే నొప్పివలన ఒకవైపుకి త్రిప్పుకుంది.

ఆదెబ్బ చప్పుడువిని ఆకుర్రవాడు వెనుకకు తిరిగి చూచెను. దండప్ప రెండవమారు మరల కొట్టుటకు చేయియెత్తి సిద్ధముగా వుండెను. అంబవ్వ యింకనూ బొమ్మవలె అట్లే కదలక నిలబడెను. ఆకుర్రవాడు ఆదృశ్యముచూసి వెంటనే తనమనసు మార్చుకొని ఆపైకిపెట్టిన కాళ్లు వెనుకకు తీసుకుని పరిగెత్తివచ్చి అంబవ్వపక్కన నిలబడెను. పైకియెత్తిన దండప్ప చేతులుపట్టుకొని క్రిందకుదింపి ఆచిన్నివాడు యిట్లు వేడుకొనెను. "దయచేసి అమ్మమీద మాత్రము మీ చేయియెత్తి కొట్టవద్దు. నేను మీతోవచ్చుటకు సిద్ధముగా వున్నాను."

దండప్ప వెంటనే ఆ చిన్నవాని చేతులు పట్టుకున్నాడు. అంబవ్వ ఆశ్చర్యముతో ఒక పెద్దకేక వేసింది. దండప్పవైపు చూస్తున్న చూపులు ఆచిన్నవానిమీద మరల్చింది. మరియు భర్తతో యిట్లు అనెను "నీయంతట నీవే బాగాచూడుము. ఆకుర్రవాడు హంతకుడేమోను. నేను నీకుచెప్పినను నమ్మకములేదు."

దండప్ప ఆచిన్నవాని చేయి పట్టుకున్నప్పటికి బలవంతముచేసి తీసుకువెళ్లుటకు ప్రయత్నము చేయలేదు. వానిని గట్టిగా పరీక్షచేసి చూస్తున్నాడు. వానిచిన్నతనము భయముచే అజాగ్రత్త అయినటువంటి అపరిశుద్ధమైనటువంటి చూపులనుబట్టి వాని హృదయము కరగెను. వెనుక ఎప్పుడో తను చేయి చేసుకుని అంబవ్వను కొట్టబోతుంటే తనకొడుకు చచ్చిపోయిన పాండురంగడు ఆమెను కొట్టకుండా అడ్డము వచ్చెను. ఆదృశ్యము యిప్పుడు మరల జ్ఞాపకము తన మనసుకు వచ్చెను. ఆపోలిక తన కొడుకుకు వీనికి సరిపోయింది. తనకు తెలియకుండానే తన చేతితో ఆచిన్నవాని చేయిపట్టుకున్న చేయి తానంత తానే విడుదలయినది. తనకళ్లు కప్పినట్లు ఆశ్చర్యపోయినాడు. అంబవ్వ వైపుతిరిగి "యీపిల్లవాడు ఎక్కడకు పోకుండా చూస్తూవుండుము నేనుయిప్పుడే వస్తాను." అనిచెప్పి తన టోపి పెట్టుకు పైకి వెళ్లినాడు.

దండప్ప వెళ్లగానే అంబవ్వ ఆచిన్నవానివైపు తిరిగి యిట్లనెను- "దయచేసి ఎక్కడకన్నా వెళ్లిపో. దైవము ఎట్లచేయదలచెనో అట్లుకానిమ్ము. నాభర్త మరల తిరిగివచ్చి ఏమిచేయునో ఎవరికి తెలుసును? యిక్కడ వుండవద్దు. వెళ్లిపో, పారిపో." అయితే! ఆచిన్నవాడు వినలేదు. అక్కడనుంచి కదలలేదు. అదిగాక ఆమెతో యిట్లనెను "అమ్మా! నాకు ఏమికోరికలులేవు. యికమీద భూమిమీద ప్రాణములతో వుండుట ఆశలేదు. పారిపోయినందువల్ల లాభము ఏమి? నాకు వచ్చునది ఏమి?"

అరగంట తరువాత దండప్ప తిరిగి వచ్చెను. అప్పుడు వాడు పోలీసు దుస్తులనుంచి మామూలువాటికి మార్చినాడు. వాడు పట్టిబనీను పొట్టిలాగు మాత్రమే ధరించినాడు. యిదిచూచి అంబవ్వ ఆశ్చర్యముతో వానిని అడిగెను. "ఇది ఏమిటి? ఏమయినది?" దానికి దండప్ప "ఏమిలేదు. నేను యీరోజునుంచి నాపనికి రాజీనామా యిచ్చినాను. అంతే." అన్నాడు.

"నాకోరకే?" అన్నాడు ఆ చిన్నవాడు. "కాదు! నాస్వంతవిషయమై. నేను నాపనికి యిక సరిపడను, ఒకరి నౌఖరీచేసి అలసిపోయాను. నేను ఒక మనిషిమాదిరి వుండాలి అనేనాకోరిక. నాకొడుకు చంపబడ్డాడు. అదిచాలునాకు." అని బదులు చెప్పెను దండప్ప. అంబవ్వ యిది విని అదేపనిగా కంటనీరు ధారగా కార్చినది. దండప్ప ఆమెను వోదార్చెను.

"ఇంతవరకు జరిగినది ఏదో జరిగినది, అది అంతా యిప్పుడు మరచిపోదాము! యీ సహాయములేని పెద్ద పట్టణములో యీరోజా ఆఖరురోజా, మనము యిక్కడ ఒకనిముషము వుండగూడదు, మనము యిక్కడ యిక వుండుట మంచిది కాదు. యీరోజు ఆఖరులాగు గడుపుదాము. నీవుకూడా యీ మహా పట్టణములో దాగి వుండుట ఎంతో చాలకష్టము."

"ఏమిటి! నేనుకూడానా!" అతనికి అడ్డువచ్చి ఆచిన్నవాడు అన్నాడు, దండప్ప అవునన్నట్లు తల ఆడించినాడు. అంబవ్వ చెప్పుటకు వీలులేనంత ఆశ్చర్యము పొందినది, ఆమెకు సగము విచారము తొలగిపోయింది. అనుమానముతో భర్తను.

"అయితే అక్కడ ఎవరన్నా వానిని అనుమానపడితే?" అన్నది.

"అయితేనేమి. అక్కడ వానినిగురించి ఎవరికి తెలియును? మనము ఎల్లా అయితేనేమి యిన్ని సంవత్సరములు ఆపూరులో లేము. పాండురంగడు బ్రతికి వుంటే వీనిలాగు కాదా? బాగు, వాడుమనకొడుకు." అని దండప్ప ముగించినాడు.

"మన కొడుకా!" అని ప్రతిధ్వనిగా అంది అంబవ్వ.

ఆచిన్నవాడు తల వంచి నిలుచున్నాడు.

